# సిలకమ్మ



ఎంకమ్మ రోజూలాగె వెలుగు రాకుండానే లేచింది.

వీధి ముందు భాగంలో కొబ్బరి చీపురుతో తుడిచి పేడనీళ్లతో కళ్ళాపుజల్లింది.

అప్పుడే నిద్రలేచి వచ్చిన సిలకమ్మ అత్తను చూసి సిగ్గుపడింది. "ముగ్గు నే పెడతాలే!" అంటూ ముగ్గుచిప్ప అందుకుని చుక్కలతో మామిడాకుల విస్తరి పెట్టింది.

చేతిలో గీతల ముగ్గే తప్ప– చుక్కల ముగ్గురాని ఎంకమ్మ ఆశ్చర్యంగా చూసింది. అప్పటికే ఆడవాళ్ళు కొందరు మంచినీళ్లు తెచ్చుకోడానికి తోటలోని బావి వైపు వెదుతున్నారు.

"రాయే కోడలుపిల్లా... నీల్లకు పోవాలీ!" పిన్నత్త మల్లమ్మ పిలుపు వినబడింది.

సిలకమ్మ రెండు చేతివేళ్ళతో జుట్టు సరిచేసుకుంది.

చీరకుచ్చెళ్లు సర్దుకుంది. సారెగా తెచ్చుకున్న పెద్ద, చిన్న ఇత్తడి బిందెలు తీసుకుని బయలుదేరింది.

"ఈ బాయిలో నీరే కనపడదేటి? నే తీత్తానుండి!" అంటూ పిన్నత్త వద్దంటున్నా సిలకమ్మ బరబరా గిలక మీద నీరు తోడింది. ముందు అత్త బిందెలు నింపి, తరువాత తన బిందెలు నింపుకుంది సిలకమ్మ.

ఓ బిందె భుజానకెత్తి, మరో చిన్నబిందె చంకన పెట్టుకుని పిన్నత్త వెంట అడుగులేసింది.

సిలకమ్మ రంగు నలుపైనా– చారడేసి కళ్ళతో కళకళలాడుతూ ఉంది. పైగా– పచ్చని చీర, రవికలో వెండి కంటె, కాసులతో, కాళ్లకి వెండి సాంజీబులతో, చేతికి వెండి కడియాలు, దండ కడియాలతో ఇట్టే ఆకర్షిస్తుంది.

"అబ్బ... ఎంకమ్మ కోడలు అందగత్తే కాదు.., పనిమంతురాలు కూడా!" అనుకున్నారు బావి దగ్గర ఆడవాళ్ళంతా.

"ఏటిరా గోపన్నా! కొత్త పెళ్ళాం వచ్చిందిగా! రాతిరి నిదురబోయావా, లేదా?" కావడితో ఎదురొచ్చిన గోపన్నను పినతల్లి వేళాకోళం చేసింది.

గోపన్న నవ్వుకుంటూ అలా ముందుకు వెళ్లిపోయాడు.

గోపన్న నీళ్లు తెచ్చి పెరటిలోని సిమెంటు గోళాలు నింపాడు. తర్వాత గోపన్న గేదెపాలు పిండడానికి దూడను వదిలాడు. ఎంకమ్మ రెండు ఇత్తడి చెంబులు తోమి అక్కడ పెట్టింది.

ఎంకమ్మ రెండవ కొడుకు గూనెవాడు. బరువు పనులు చెయ్యలేడు. గోపన్న నింపిన చెంబుల్లో పాలు సేరు చెంబులతో వత్తను ఇళ్లల్లో పోసి వచ్చాడు.

ఎంకమ్మ గేదెపేడతో పిడకలు చేసి పెరటి వైపు మట్టిగోడ నిండా పరిచి వచ్చింది. అప్పటికే బారెడు పొద్దెక్కింది.

"ఓయమ్మో! వణ్ణం పెట్టవే? పొలానికి పోవాలా!" అంటూ గోపన్న తొందరచేశాడు.

ఎంకమ్మ– మిద్దె గదిలోంచి కోడలు తెచ్చిన స్టీలు కంచాలు తెచ్చి కొడుకులిద్దరికీ అన్నాలు పెట్టింది.

"ఇదేటి? ఈ స్టీలు కంచాలిలా మెరిసి పోతున్నాయేటి?" అన్నారు ఇద్దరూ ఒకేసారి.

"సిలకమ్మ తెచ్చినాదిలే! వేడి వణ్ణం వార్చి ఉల్లికారం సేసినాది!" అంది ఎంకమ్మ.

"ఓయబ్బో! ఉల్లికారం సానా బాగుందే!" అంటూ కొడుకులిద్దరూ లొట్టలేసుకు తింటుంటే ఎంకమ్మ వారిని సంతృప్తిగా చూసుకుంది.

గోపన్నా, నాగులు మేకల్ని, గేదెను తోలుకుని గోదావరి గట్టు వైపుకు వెళ్లాలని బయలుదేరారు.

"గోపన్నా! గోపన్నా! సిన్నయ్యగోరు రమ్మంటున్నారు..!" అంటూ అంతలో ఈరిగాడు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"నువ్వెల్లి రా! రా!" అంటూ తమ్ముడికి మేకల్ని, గేదెను అప్పచెప్పి గోపన్న- వచ్చిన ఈరన్న వెంట బయలుదేరాడు.

"ఓయత్తా! అదేటి? అలా ఎల్లిపోతే మన పనుల మాటేటి?" సిలకమ్మ అత్తను ఆశ్చర్యంగా అడిగింది.

"కొత్తగా వచ్చినావు గందా! నీకేటి తెలుత్తాదే కట్టం..? మన నేల రెండు ఎకరాలు ఆరికాడ కుదువ ఉన్నాదే! అంతా తప్పుడు లెక్కలు సూపి ఓ అయిదు కుంచాల నేల చేజిక్కించుకున్నాడు. ఇప్పుడీ నేల మీద ఏసినాడు కన్ను..!" ఎంకమ్మ గుండె చెరువయింది. కళ్ళు నీళ్లతో నిండాయి. ఇక నిలబడలేక నులక మంచం మీద చతికిలబడింది.

"ఓ యత్తా! అదేటీ? అలా అయినావేటి?" సిలకమ్మ సిల్వరు గ్లాసుతో నీళ్లు తెచ్చి అత్తకు అందించింది.

"ఇదిగో... ఈరు మన పనులు సూసుకోనీకుండా రాసుకు తింటారే! ఈరి జిమ్మడి పోను.., ఈరి కొంప నాశనమై పోను!" ఎంకమ్మ కోపం పట్టలేక తిట్టడం మొదలుపెట్టింది.

"ఊరుకోయే యత్తా! నే లేనా! నే సూసుకుంటాగా! నువ్వూరుకోయే!" చిన్నదైనా సిలకమ్మ మాటలతో ఎంకమ్మ గుండె కాస్త దిటవయింది.

"ఆడు ఒట్టి ఎర్రిబాగులోడే! ఆడిని, ఈ కొంపని నీ సేతుల్లో పెడుతున్నా! నువ్వే సూసుకోవాలా!" ఎంకమ్మ ఆమె రెండు చేతులు పట్టుకుంది. ఎంకమ్మ కళ్ళనుండి కారే కన్నీళ్లు సిలకమ్మ చేతుల మీద పడ్డాయి.

సిలకమ్మ పమిట కొంగుతో ఆమె కన్నీళ్లు తుడిచింది. మరోసారి ఆమెకు ధైర్యం చెప్పింది.

ఎంకమ్మ కోడలు సాయంతో మెల్లిగా లేచింది. మేకల పాకంతా తుడిచి శుభ్రం చేసింది. మేకల పెంట ఎత్తి చెత్తకుప్పలో వేసింది.

ఎంకమ్మ మగడు బతికున్నప్పుడు నలభై వరకు మేకలుండేవి. ఇప్పుడు ఇరవై మాత్రమే మేకలున్నాయి. మేకల్ని అమ్మినప్పుడు ఆ దబ్బుతో తిరిగి మేకలు కొనుక్కుంటారు.

ఇప్పుడు ఎంకమ్మ కుటుంబానికి ఆ మేకల్ని పెంచడమే కష్టమైపోయింది. మేకలే వారి సంపద..! అదే తరిగిపోతోంది.

అప్పటికే సూర్యుడు నడినెత్తి మీదికొచ్చాడు. ఎంకమ్మ, సిలకమ్మ అప్పటివరకు ఏమీ తినలేదు. కడుపులో ఆకలి నకనకలాడుతోంది.

ఎంకమ్మ పెరటివైపు చూరు వారనున్న పొయ్యి అంటించి సిల్వరు గిన్నెతో ఎసరు పెట్టింది. పాతడబ్బాలో అడుగునున్న బియ్యం చేటలో పోసి తెచ్చింది.

"నే సేత్తాగా! నూ కూకో!" సిలకమ్మ ఆమె చేతిలోని బియ్యంచేట అందుకుంది.

"ఎంకమ్మో! ఎంకమ్మో! వరిపిండి కొట్టాలంట, మినప్పిండి ఇసరాలంట! సిన్నమ్మగారు ఎంటనే రమ్మంటున్నారు!" అంటూ సీతాలు గుక్క తిప్పుకోకుండా వచ్చిన పని చెప్పేసింది.

"రెండు ముద్దలు కూడు తిని వత్తాది! ...నువ్వెల్లు!" అంది ఎంకమ్మ.

"బేగిరా!" అంటూ సీతాలు వెనక్కి తిరిగింది.

"నేనూ వత్తారే! ఓ యత్తా!" అంది సిలకమ్మ.

"నువ్వే కాదు, రాజమ్మా వత్తాది!" అంది ఎంకమ్మ.

అన్నం ఉడగ్గానే ఇద్దరూ చెరో నాలుగు ముద్దలు తిన్నారు. ముగ్గురూ చిన్నమ్మగారి ఇంటికి బయలుదేరి వెళ్లారు.

అక్కడ వరిపిండి కొట్టారు. మినప్పిండి విసిరారు. పెసలు, మినుములు, విసిరి చాయపప్పు కోసం నూనె రాసి ఎండలో పెట్టారు. సాయంకాలం వరకు ముగ్గురూ కలిసి ఏదో పని చేస్తూనే ఉన్నారు.

దీపాలు పెట్టే వేళయింది.

చిన్నమ్మగారు లెక్కలు కట్టి ముగ్గురుకీ రావలసిన డబ్బు ఇచ్చింది. ఒక సేరు బియ్యం కూడా కొలిచి వారి కొంగుల్లో పోసింది. మరునాడు చేయవలసిన పని పురమాయించింది.

"ఆయ్ఁ..! సిత్తం! రేపొద్దారి!" అంటూ ముగ్గురూ ఇంటి దారి పట్టారు.

సిలకమ్మ దృష్టి అంతా అప్పు మీదే ఉంది. 'అది ఎలా తీర్చాలా..?' అని ఆలోచిస్తోంది.

"ఓ యత్తా! దినాం పని దొరికితే మన అప్పు తీరుద్దే!" అంది సిలకమ్మ ఇంటి కెళ్లగానే. ఆమెలో కొత్త ఆశ చిగురించింది.

"అది సత్తమే కోడలా!" అంది ఎంకమ్మ సంబరంగా.

సిలకమ్మ డబ్బంతా లెక్క కట్టింది.

"అదేటి? నీకు లెక్కెట్టడం వచ్చా?" అంది ఎంకమ్మ ఆశ్చర్యంగా.

"నాలుగో కళాసు సదివినా!" అంది సిలకమ్మ సంబరంగా.

చిల్లరతో మొత్తం ఇరవై రూపాయలయింది. సిలకమ్మ ఆ డబ్బు ఓ చిన్న ముంతలో వేసి పచ్చని గుడ్డ వాసిన కట్టింది. మీది గదిలో కావడి పెట్టెలో దాన్ని దాచి వచ్చింది.

గోపన్న రాత్రి పొద్దుపోయాక ఇంటికి వచ్చాడు. ఎంకమ్మతోపాటు కోడలు కూడా మెలకువగానే కూర్చుంది.

"ఇంత పొద్దోయిందాకా ఏడున్నావురా? పెల్లాం వచ్చినాదని మరిసినావా ఏటి? ఇగసెయబోక... బాగోదు" ఎంకమ్మ కొడుకును మందలించింది.

"ఆరు తాటిపూడి ఎల్లి రమ్మన్నారు. సైకిలిచ్చినారులే! ఆకలేత్తోందే... వణ్ణం పెట్టవే!" అన్నాడు గోపన్న.

"పోయి కాడ ఏడినీల్లున్నాయి. రెండు సెంబులు పోసుకురా!" అంది ఎంకమ్మ.

ఎంకమ్మ చూరుకు తగిలించిన అరికెన లాంతరు వత్తి పెద్దది చేసింది.

గోపన్న స్నానం చేసి వచ్చి అన్నం గబగబా తింటుంటే... ఎంకమ్మ కొడుకు వైపు జాలిగా చూసింది. ఎంకన్న నాలుగు ముద్దలు తిన్నాడు. నిద్ర ముంచుకొస్తుంటే తిన్న కంచంలోనే చెయ్యి కడుక్కుని లేచాడు. పక్కనే ఉన్న నులక మంచం మీద వాలబోయాడు. తల్లి చెయ్యి పట్టుకుని తీసుకెళ్లి మీది గదిలో పట్టెమంచం మీద పడుకోబెట్టింది. ఎంకమ్మ ఆ పాత నులక మంచం మీద నడుం వాల్చింది.

అత్తకు నిద్ర పట్టిందనుకున్న సిలకమ్మ గదిలోకి వెళ్లి గోపన్నను లేపింది. గోపన్న కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చున్నాడు. సిలకమ్మ తాను తెచ్చిన మిఠాయి ముక్క నోటి కందించింది.

"ఇదేటి? సీనీదా? సానా బాగుంది!" అంటూ గోపన్న లొట్టలేసుకుంటూ తిన్నాడు.

"ఏడకో ఎల్లినావు గందా! ఆరు ఏటిచ్చినారు?" సిలకమ్మ ప్రశ్నించింది.

గోపన్న "ఏటీ ఇవ్వలేదు!" అనగానే సిలకమ్మ ఆశ్చర్యపోయింది.

"కట్టం సేసినావు గందా? ఆరు ఏటీ ఇవ్వకపోతే మనం బతికేదెట్టా? మన పనులు ఏరు సేత్తారు? ఈ పొద్దు నుంచి ఆరు పదో, పరకో ఇత్తే తప్ప– ఏరి పనికీ పోబోక!" అంది సిలకమ్మ.

సిలకమ్మ మాటలు అతనికి పూర్తిగా అర్థంకాకపోయినా, "సరే..." అంటూ తలూపాడు. పెళ్ళాం చెప్పినట్టు మాత్రం చెయ్యాలనుకున్నాడు.

గోపన్న గుండెల మీద తలవాల్చిన సిలకమ్మ అతన్ని లతలా చుట్టేసుకుంది. తెల్లవార్లూ ఏదో మేక అరుస్తూనే ఉంది.

ఆ రోజు మేకల్ని, గేదెను పొలంలో మంద కట్టడానికి తీసుకెడుతున్నారు. రాత్రిళ్ళు అన్నదమ్ములిద్దరూ కాపలాగా పొలంలోనే పడుకుంటారు.

"అదేటిరా! సిలకమ్మని రాతిరి వంటరిగా వదలి నువ్వాదుంటే ఎలారా?" అంది ఎంకమ్మ దిగులుగా.

"మా చిన్నోడిని పిలిపిత్తా!" సిలకమ్మ అంటూండగానే ఆమె తమ్ముడు లచ్చుడు రానే వచ్చాడు.

'ఆ దేవుడే పంపించిండు' అనుకుంది ఎంకమ్మ.

సిలకమ్మ వదనం సూర్యోదయంలో తామర పువ్వులా కళకళలాడింది.

లచ్చుడు నాలుగు ముద్దలు అన్నం తిని వారి వెంటే పొలం వెళ్లాడు.

"మన పొలంలో మనం మంద కట్టుకునే రోజు ఎప్పుడొత్తదో!" అంది ఎంకమ్మ దిగులుగా.

"దానిదేముందే? ఓ యత్తా! అది మళ్లీ ఈ కాలానికి సూద్దారి!" అంది కోడలు.

అత్తా, కోడలు- రాజమ్మతో కలిసి ఏదో పనికి పోతూనే ఉన్నారు. చేతినిండా పనే! ఊరగాయల కాలంలో కారం కొట్టడం, డప్పుకొట్టడం, ఆవపిండి విసరడంతో వారికి మరింత పని దొరికింది. ఆ డబ్బుతో మూడు పిడతలు నిండిపోయాయి.

ఆరోజు గోపన్నను రమ్మనమని చిన్నయ్యగారు మళ్లీ కబురు చేశారు. గోపన్న భార్య మాటలు తలపుకు వచ్చి "రాలే" నని సమాధానమిచ్చాడు.

వారి ఇంటిముందే- వచ్చిన మనుష్యులు గోపన్నను చేతికర్రలతో చావకొట్టారు. ఎదురుగా పోలీసుస్టేషను ఉంది. పోలీసులు రావడం చూసి వారు పారిపోయారు.

ఎంకమ్మ, సిలకమ్మ గుండెలు పగిలేలా ఏడ్చారు. రాజమ్మే వారిని ఓదార్చింది. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి కట్లు కట్టించి ఇంజక్షన్ చేయించారు.

నాలుగు రోజులు గోపన్న మంచం మీదే ఉండిపోయాడు. దెబ్బలు కాస్త మానాక గోపన్న లేచి తిరగగలిగాడు.

ఓరోజు సాయంకాలం పెద్ద గాలిదుమారం వచ్చింది. ఇంటి మీది తాటాకులన్నీ ఎగిరిపోయాయి. తరువాత కురిసిన వడగళ్ళ వానకి ఇల్లంతా మడుగయింది. మేకల పాక కూలింది.

సిలకమ్మ భయంతో బిగుసుకుపోయింది.

ఆమె పుట్టింటోరిది పెంకుటిల్లు. గాలి దుమారం వచ్చినా, కుంభవృష్టి వానలు కురిసినా ఆమె ఎప్పుడూ ఇలాంటి దృశ్యం చూడలేదు. ఆమె కూర్చున్న నులక మంచం నీళ్లలో తేలింది.

"ఓ యత్తా! ఇదేటే?" అంది అత్తను వాటేసుకున్న సిలకమ్మ.

"మన బతుకుల్లో ఇది మామూలే!" ఎంకమ్మ కోడలిని ఓదార్చింది.

గాలి దుమారం వెలిసాక కొబ్బరిచీపురుతో నీరంతా తుడిచింది ఎంకమ్మ. గోనెతట్టుతో బురదంతా తుడిచింది. అంతలో... గోపన్న, నాగులు పొలంలోని మేకల్ని ఇంటికి తీసుకువచ్చారు. ఆ ఇంటికి చుట్టూ మట్టిగోడలు. పైన తాటాకు కప్పు. గుమ్మాలకి మాత్రం కర్ర తలుపులున్నా- పొట్టిగా నాలుగు అడుగులే అవడంవల్ల తలలు వంచే లోపలకు వెళ్లాలి. వీధిలో ఎడంవైపు మేకల పందిరి. అది పడిపోకుండా చుట్టూ తాటాకు దడి ఉంది. గేదెను మాత్రం బయటే కట్టేస్తారు. పెద్దవానలు వస్తే గోడలు కూలిపోతూ ఉంటాయి. ఎంకమ్మ మట్టితో ఎప్పటికప్పుడు మెత్తుతూ ఉంటుంది.

గోపన్న, నాగులు, లచ్చుడు సాయంతో మేకల పాక రాటలు పాతి, తిరిగి పైన తాటాకు కప్పి సరిచేశాడు. చుట్టూ పడిపోయిన దడి మళ్లీ కట్టాడు. తర్వాత ఇంటిపైకి ఎక్కి తాటాకులన్నీ కప్పి కట్టాడు. చీకటి పడకుండా కిందికి దిగాడు. అప్పటికి సిలకమ్మ ప్రాణం కుదుటపడింది.

లచ్చుడు ఆ పూటకు అక్కడ ఉండి మరునాడు వాళ్ళ ఊరు వెళ్లిపోయాడు. అక్క సిలకమ్మని వెంట రమ్మన్నా, ఆమె తర్వాత వస్తానని తమ్ముణ్ణి పంపేసింది.

వర్షాలు ప్రారంభమయ్యాయి.

వాగులు, వంకలు నిండాయి.

గోపన్న ఇంటి చుట్టూ ఉన్న గోతులు నిండాయి. ఒకటే కప్పల బెకబెకలు..!

గోపన్నకు చేతినిండా పనే! వరిచేలు పెరుగుతుంటే వాళ్ళు కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. సీతాలచ్చిమి వీధి వైపు, దొడ్డి వైపు నాటిన పూలచెట్లతోపాటు కూరగాయల చెట్లు, పాదులు పెరిగి కాపుకొచ్చాయి.

గోపన్న వాళ్లు ఎరువులు, మందులు, కొనడానికి అప్పు తీసుకుంటారని ఎదురుచూస్తున్న చిన్నయ్య కోరిక ఎండమావే అయింది. బ్యాంకు లోనుతోనే ఎరువులు, పురుగుల మందులు కొన్నారు. పైగా- మరో పది మేకలు కూడా బ్యాంకు లోనుతోనే కొన్నారు. ఆ సంవత్సరం వరి ధాన్యం తెగ పండిందన్నారు రైతులు.

సిలకమ్మ ఓరోజు గోపన్నతో పుట్టింటికి వెళ్లింది.

తండ్రితో మాట్లాడి తన వంటి మీది వెండినగలు అమ్మించి డబ్బు తీసుకుంది. గోపన్న వద్దన్నా ఆమె వినలేదు. మరునాడే తిరిగి మగనితో ఇల్లు చేరుకుంది. కళకళలాడే కోడలు అలా బోసిగా ఉంటే ఎంకమ్మ చూడలేకపోయింది.

"అదేటే... నగలన్నీ అమ్మేసినావూ? పంట సేతికొచ్చినాక తిరిగి సేపిస్తాలె?" అంది.

సంక్రాంతి నెల పట్టారు. ఊరంతా ఏదో కొత్త సందడి!

సిలకమ్మ ముఖంలో ఏదో దిగులు ఉంది. ఎంకమ్మకి అంతు పట్టలేదు.

ఆరోజు పంట చేలు కోసి కుప్ప వేశారు. అప్పుడే ఇంటికొచ్చాడు గోపన్న.

"ఏరా గోపన్నా... ఎన్ని కోటాలు తూగుతాయేటి?"

ఎంకమ్మ ఆతురతగా అడిగింది.

"ధాన్యం కొట్టినాకే తెలుస్తుంది..!" అన్నాడు గోపన్న.

నాలుగు మెతుకులు తిని తిరిగి పొలం పరుగెత్తాడు. మరునాడు ధాన్యం కొట్టడం ప్రారంభించారు. రాత్రి చీకటిపడే వేళకి పనులు పూర్తయ్యాయి. కోటాలు తూచి కపులు ధాన్యం చిన్నయ్యగారింటికి పంపించాడు. మిగిలిన ధాన్యం గోపన్న ఇంటికి బండిలో తీసుకొచ్చాడు. గోపన్నకి బండి, ఎద్దు లేవు. సిలకమ్మ తండ్రి మేనమామే అన్ని ఏర్పాట్లూ చేశాడు.

ఇంటి ముందు బండి ఆపి ధాన్యం బస్తాలు దింపుతుంటే... చిన్నయ్య మనుషులు బడెతలతో యమదూతల్లా అక్కడ ప్రత్యక్షమయ్యారు.

'చిన్నయ్యగారి బాకీ తీరిత్తేగాని ధాన్యం బస్తాలు దింపటానికి వీల్లే ' దని అడ్డుపడ్డారు. ఎవరు ఎంత చెప్పినా వినలేదు.

"రేపు సాయంకాలం కచేరి కాడికి అందరూ రండి. అక్కడ లెక్కలు చూద్దాం! ఇప్పటికి ధాన్యం గోపన్న ఇవ్వటం మంచిది!" అన్నాడు పంచాయితీ ప్రెసిడెంటు.

"అవును. అలా చేస్తేనే బాగుంటుంది. పైగా... ఆయన గ్రామపెద్ద. ఆయన చెప్పినట్లు చెయ్యడం మంచిది!" అన్నారు మిగిలిన పెద్దలు.

ఇంక ఏం చెయ్యలేక చిన్నయ్య మనుషులు అక్కడ నుంచి మెల్లగా జారుకున్నారు.

వచ్చిన పెద్దలు వెనక్కి తిరిగారు.

సావిట్లో పేర్చిన ధాన్యం బస్తాలకు కాపలాగా గోపన్నా, బావమరిది నాగులు వాటి పక్కనే పడుకున్నారు. తెల్లవార్లూ అరికెన లాంతరు, మరోపక్క బుడ్డిదీపం వెలుగుతూనే ఉన్నాయి.

తెల్లవారింది మొదలు సిలకమ్మ తండ్రి తెచ్చిన డబ్బు, తాను దాచిన ముంతల్లో డబ్బు లెక్కలు కడుతూనే ఉంది. ఎంకమ్మకి, గోపన్నకి మాత్రం లోపల దిగులుగానే ఉంది.

సాయంకాలం అందరూ కచేరి సావిడికి చేరుకున్నారు. ఒకవైపు చిన్నయ్య, ఆయన మనుషులు కూర్చున్నారు. మరోవైపు గోపన్న, మామగారు, లచ్చుడు, నాగులు... వారి వెనుక సిలకమ్మ, ఎంకమ్మ, రాజమ్మ కూర్చున్నారు. అంతలో పంచాయతీ ప్రెసిడెంటు, ఇతర పెద్దలు వచ్చి ఎదురుగా ఉన్న రాగి చెట్టుకింద కుర్చీలో కూర్చున్నారు.

"ఇదిగో... అన్ని వడ్డీలు, అసలు... అన్నీ కలిపి మొత్తం ఆరువేలయింది. ఆ డబ్బుకట్టి నేల విడిపించుకోవాలి! గోపన్నా డబ్బు పట్టుకొచ్చావా?" అడిగాడు పంచాయితీ ప్రెసిడెంటు.

"ఆయ్ం...! సిత్తం బాబా!" అంటూ గోపన్న సిలకమ్మ వైపు చూశాడు.

సిలకమ్మ కట్టిన లెక్కల ప్రకారం కూడా ఆరువేలే అయింది. సిలకమ్మ ఆశ్చర్యపోయింది. మహా సంతోషంతో డబ్బు మూట గోపన్నకి అందించింది.

"ఏందే! అందులో ఆరుఏలు ఉన్నాయా?" అంటూ అడిగిన అత్తకు భయపడి "అత్తా! ఆరు ఏలు ఉన్నాయే?" సిలకమ్మ సమాధానం చెప్పింది.

రెండు చేతులు గుండెల మీద వేసుకుని గట్టిగా ఊపిరి తీసుకుంది ఎంకమ్మ.

'అంత డబ్బు ఆళ్లెక్కడ కట్టగలరు? భూమి మనదే!' అనుకుంటూ మీసాలు మెలేసుకుంటున్న చిన్నయ్య ముఖం గోపన్న చేతిలో డబ్బు మూట చూసి చిన్నబోయింది.

గోపన్న ఆ డబ్బు మూట పెద్దల ముందు పెట్టాడు. వాళ్ళు ఆ మూట విప్పి డబ్బు లెక్కపెట్టారు. సరిగ్గా ఆరువేలుంది.

"చిన్నయ్యా! ముందు ఆ భూమి కాగితాలు మాకిచ్చి, ఇదిగో... డబ్బు మూట అందుకో!" అన్నాడు ప్రెసిడెంటు.

"నాకు భూమే కావాలా! డబ్బొద్దు!"

... అని చిన్నయ్య అరిచినా పెద్దలు వినలేదు. పైగా మందలించారు.

చిన్నయ్య అవమానంతో పళ్లు నూరుకుంటూ తన మనుషులతో కదలబోయాడు.

"చిన్నయ్యా! ఇది మర్యాద కాదు... ముందు కాగితాలు ఇక్కడ పెట్టి మరీ కదులు!" అన్నాడు ప్రెసిడెంటు.

చిన్నయ్య కోపంతో ఊగిపోయాడు. అయినా... చేసేదేమీ లేక భూమి తనఖా కాగితాలు ప్రెసిడెంటు ముందుకు విసిరాడు. తన మనుషులతో అక్కడ నుండి విసవిసా వెళ్లిపోయాడు.

"గోపన్నా! ఇదిగో... నీ భూమి కాగితాలు తీసుకో! ఇక, నీ భూమి నువ్వే వ్యవసాయం చేసుకో!" అన్నాడు ప్రెసిడెంటు.

గోపన్న ఆయన చేతిలోనుంచి కాగితాలు అందుకున్నాడు. వాళ్ళ సంతోషానికి అంతు లేదు.

"దండాలు బాబా!" అంటూ అందరికీ దండాలు పెట్టాడు.

"అబ్బో! గోపన్న పెళ్ళాం సానా సదువుకుందంట! ఆ డబ్బంతా ఆమే పోగుసేసిందంట! ఇగ ఆ కొంపకే ఉంది సిరి!" అన్నారు ఆడవాళ్ళంతా.

ఆ మాటలు విన్న గోపన్న– పెళ్ళాం సిలకమ్మ వైపు గర్వంగా చూశాడు.

ఇంటికెళ్లిన సిలకమ్మ ముఖం ఎందుకో వాడిపోయి ఉంది.

"అదేంటీ సిలకా! అలాగున్నావేటే?" అడిగింది ఎంకమ్మ.

"ఏం లేదే! ఓ యత్తా! నే మాయమ్మకాడికి ఎల్లిపోతానే!" అంది దిగులుగా.

"అదేటే? ఆ మాటేటే? ఈడ ఉండక ఆడకెందుకే?" ఎంకమ్మ అర్థంకాక అడిగింది.

"నాకు పిల్లలు లేరంటే..! మొన్న మా ఊరి డాక్టరుగారు సెప్పినారే! అత్తా... నీ కొడుక్కి మరో మనువు సెయ్యి!" ఆ మాట అంటుంటే సిలకమ్మ కళ్ళలో నీళ్లు తిరిగాయి.

"ఓసినీ! ఈ కొంపకి నువ్వు మాలచ్చిమే! ఈడ దాటరమ్మకి నే సూపిత్తానే! వైద్యం సేపిత్తా! దిగులు పెట్టుకోబోక! నువ్వెడకి పోతావే?" అంటూ ఎంకమ్మ ఆమె తల నిమిరి మెటికలు విరిచింది.

సిలకమ్మ ముఖంలో దిగులు పోయింది. పున్నమి చంద్రబింబంలా కళకళలాడింది. కడుపులో ఏదో కదులుతూన్నట్లు అనిపించింది. ఏదో కొత్త ఆశ చిగురించింది.

ఎంకమ్మ కళ్ళ ముందు ఆ తాటాకుల కొయ్య పెంకుటిల్లులా కళకళలాడింది.

సావిట్లో బట్ట ఉయ్యాల్లో చంటిపిల్లాడు పకపకలాడుతూ కనిపించాడు.